రేపు శాకాంబరి దేవి అలంకరణ

ఆల్విన్‌కాలనీ: ఆషాఢ మాసం రెండవ శుక్రవారాన్ని పురస్కరించుకొని ఆల్విన్‌కాలనీలోని భ్రమరాంబ దేవి అమ్మవారిని శాకాంబరి దేవిగా అలంకరించనున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఉదయం 8 గంటలకు అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన కార్యక్రమం ఉంటుంది. మహిళా భక్తులు కుంకుమార్చన సేవలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అమ్మవారి అలంకరణలో ఎవరైనా కూరగాయలు అందజేసేవారు గురువారం మధ్యాహ్నం వరకు ఆలయంలో అందజేయాలని సూచించారు. శుక్రవారం అమ్మవారికి అలంకరించిన కూరగాయలతో ప్రసాదంగా శనివారం అన్నదాన కార్యక్రమాన్ని ఆలయంలో నిర్వహించనున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీలో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఆయా కాలనీల్లో నెలకొన్న వివిధ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తున్నామని అధికారులు అన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని మనసా సరోవర్ హైట్స్ ఫేజ్ 2 ప్రాంతంలో చెత్తను తొలగించారు. వీధి దీపాల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యను బుధవారం పరిష్కరించారు. ఇటీవలే బీజేపీ నాయకులు తిరుపతియాదవ్ కాలనీ వాసులతో కలిసి అధికారులకు సమస్యలను వివరించారు. కార్యక్రమంలో మకరంద్, జెమినీ, రమేష్, వరుణ్, డిప్యూటీ కమిషనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

బాలానగర్: వర్షాకాలం దృష్ట్యా బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులకు బకెట్ క్లీనింగ్ కోసం లిఖితపూర్వక విజ్ఞప్తి చేశారు. దీంతో బుధవారం జీహెచ్ఎంసీ సిబ్బంది బాలానగర్ పరిధిలోని కల్యాణినగర్‌లో బకెట్ క్లీనింగ్ మెషిన్‌తో పూడికతీత పనులు చేశారు. పనులను కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో చంద్రపాల్, రంగంపేట్, శ్రీనివాస్, సింగజోగి రామేశ్వర్, మహేందర్ రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



మూసాపేట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన ఎన్. రామచంద్రరావును బుధవారం ఆయన నివాసంలో బీజేపీ మేడ్చల్ జిల్లా సెక్రటరీ తూము శైలేష్ కలిసి సన్మానించారు. పంచలోహ వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని ఆయనకు బహూకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సెల్ సభ్యురాలు సద్గుణారెడ్డి, యువ మోర్చా నాయకులు కార్తిక్, ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ బోయిన్‌పల్లి: బీజేపీ నూతన అధ్యక్షుడికి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ జిల్లా నాయకుడు మక్కాల నర్సింగ్‌రావు, వేణుగోపాల్‌రెడ్డి, జగదీష్, సత్యమూర్తి తదితరులు అధ్యక్షుడిని సన్మానించారు.

భారీగా జన సమీకరణ చేయాలి

ఎమ్మెల్సీ సారయ్య, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి



కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ శుక్రవారం నిర్వహించనున్న సమ్మేళన సభను విజయవంతం చేయాలని, భారీగా జనసమీకరణ చేయాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. గాజులరామారంలోని సిటీ ప్యాలెస్‌లో నిర్వహించిన కార్యక్రమానికి పలువురు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ పర్యటన సందర్భంగా లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించే గ్రామ స్థాయి, డివిజన్ అధ్యక్షుల సమ్మేళన సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, కో ఆర్డినేటర్స్ శశికళ యాదవరెడ్డి, గజ్జెల కాంతం, ఏపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మొక్క'వోని దీక్ష!

- వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు ప్రత్యేక కార్యాచరణ
- 2025–26లో 70 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయం



సాక్షి,సిటీబ్యూరో: మళ్లీ 'మొక్క'వోని దీక్షతో వనమహోత్సవానికి కార్యాచరణ ప్రణాళికతో జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. వర్షాలు ప్రారంభంకావడంతో ఈనెల రెండోవారం నుంచి వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు పురపాలక సంఘాలు, మున్సిపల్ సర్కిళ్లు, ప్రభుత్వ శాఖల వారీగా లక్ష్యాలను ఖరారు చేసిన అధికారులు.. స్వచ్ఛంద సంస్థలను కూడా భాగస్వాములను చేసేందుకు చర్యలు తీసుకుంటుంది.

ప్రకృతి సమతుల్యత...

సమృద్ధిగా వర్షాలు కురవాలంటే సాధారణంగా అటవీ విస్తీర్ణం కనీసం 33 శాతం ఉండాలని అటవీశాఖ పేర్కొంటున్నప్పటికీ, నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో మాత్రం పరిస్థితి విరుద్ధంగా ఉంది. పట్టణీకరణతో కాంక్రిట్ జంగల్‌గా మారుతున్న శివారు పురపాలికల్లో ఆ లోటును అధిగమించేందుకు పుర యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవానికి శ్రీకారం చుడుతోంది. ఈ నేపథ్యంలోనే జిల్లా వ్యాప్తంగా మొక్కలను నాటాలని నిర్ణయించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు మొక్కలు నాటే లక్ష్యాలను అధికార యంత్రాంగం ఖరారు చేయడంతో అందుకు అనుగుణంగా ఆయా శాఖలు కార్యాచరణతో ముందుకు సాగుతున్నాయి.

6 మున్సిపాలిటీల్లో ప్రత్యేక కార్యాచరణ..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఈ ఏడాదిలో 70 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. శివారు 16 పురపాలక సంఘాల్లో వనమహోత్సవంలో భాగంగా బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు మేడ్చల్, తూంకుంట, ఘట్‌కేసర్, నాగారం, దమ్మాయిగూడ, గుండ్లపోచంపల్లి, కొంపెల్లి, ఎంసీపల్లి, అలియాబాద్, ఎల్లంపేట మున్సిపాలిటీలతో సహా జీహెచ్ఎంసీ పరిధిలోని 6 మున్సిపల్ సర్కిళ్లలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

10 శాతం ఔషధ, పండ్ల మొక్కలు

వనమహోత్సవంలో పండ్లు, ఔషధ మొక్కలతో పాటు ఈత మొక్కలను తప్పనిసరిగా 10 శాతం నాటేలా చర్యలు తీసుకుంటున్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటికి రోజూ నీళ్ల అందించడం, ఎరువు తదితర సంరక్షణ కార్యాచరణ సిద్ధం చేశారు. మొక్కలు నాటిన స్థలాలను జియో ట్యాగింగ్ ద్వారా టీజీఎఫ్ఎంఐఎస్ వెబ్‌సైట్‌లో ప్రతిరోజూ నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు

జిల్లాలో అటవీశాఖ అధ్వర్యంలో తూంకుంట, కండ్లకోయ, దూలపల్లిలోని 3 నర్సరీలు, 16 పురపాలక సంఘాలలోని నర్సరీల్లో లక్ష్యానికి తగినట్లుగా మొక్కలు పెంచుతున్నారు. ఈసారి వనమహోత్సవంలో గతేడాది నాటిన మొక్కలతో పాటు టేకు, ఈత, వెదురు, మలబార్, ఇప్ప, మద్ది, వెలగ, మర్రి, వేప, రేల, బాదాం, రావి, చింత, తులసి, నిమ్మ, జామ, సీతాఫలం, ఖర్జూర, మందార, సన్నజాజి, మల్లె నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పచ్చదనం.. భూ పరిరక్షణ

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పచ్చదనాన్ని పెంచడంతో పాటు కబ్జాకు గురౌతున్న ప్రభుత్వ, అసైన్డ్, అటవీ, చెరువు శిఖం భూముల పరిరక్షణే లక్ష్యంగా వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. అర్బన్ పార్కులతో సహా పల్లె , పట్టణ ప్రాంతాల్లో ప్రకృతి వనాల లక్ష్యంగా వనమహోత్సవం విజయవంతం చేసేందుకు ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. రహదారుల పక్కన, విద్యాసంస్థలు, చెరువుగట్లు, ప్రైవేటు రంగ సంస్థల కార్యాలయాల్లో వెంచర్లు, లే అవుట్లు, శ్మశానవాటికల్లో మొక్కలను విరివిగా నాటాల్సి ఉంది.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

సాక్షి సిటీబ్యూరో: వనమహోత్సవంలో పండ్లు, ఔషధ మొక్కలను కూడా ఎక్కువగా నాటేలా చూడాలని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీహాల్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. గ్రామీణాభివృద్ధి, అటవీ, పంచాయతీరాజ్‌శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వనమహోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం ముందుగానే మొదలైనందున ఈసారి మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా ముందుగానే అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాల న్నారు.

ఎస్‌టీపీ పూర్తైతే మురుగునీటి సమస్యకు పరిష్కారం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ప్లాంట్ పనులను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: ఎస్‌టీపీ ప్లాంట్ల నిర్మాణం పూర్తైతే నియోజకవర్గంలో మురుగునీటి సమస్య పరిష్కారమవుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలాజీనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఎస్‌టీపీ ప్లాంట్ పనులను బుధవారం పరిశీలించారు. అదేవిధంగా అంబేద్కర్ నగర్‌లో డ్రైనేజీ సమస్యపై కోర్టు అసోసియేషన్ సభ్యులతో చర్చించి సమస్య పరిష్కరించే దిశగా సూచనలు చేశారు. ఎస్‌టీపీ ప్లాంట్ వద్ద సబ్‌స్టేషన్ కోసం, స్థలం అనుమతుల కోసం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును అధికారులు కోరగా.. పరిశీలించి కచ్చింతంగా అందిస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్యమే పరమావధిగా గతంలో మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో ఎస్‌టీపీ ప్లాంట్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఇందులో భాగంగా అవి పూర్తయ్యే దశకు చేరుకున్నాయని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబిహా బేగం, మాజీ కార్పొరేటర్ బాబురావు, డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్లపై వర్షపు నీటిని తొలగించాలి



రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు

కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎడతెరిపి లేకుండా కురుస్తున వర్షాల వల్ల రోడ్లపై నిలిచిన నీటిని తొలగించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అధికారులకు సూచించారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడ పరిధిలోని ఇంద్రహిల్స్ కాలనీలో రోడ్డు పైన వరదనీరు చేరి ఇబ్బందిగా ఉందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన బుధవారం కాలనీలో పర్యటించి పరిశీలించారు. ఇప్పటికే సీసీ రోడ్డు మంజూరై ఉందని, త్వరలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణ గౌడ్, వెంకట్‌నాయక్, శివరాజ్ గౌడ్, పోశెట్టి గౌడ్, నరసింహులు, సిద్దయ్య, సత్యనారాయణ, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శివాజీనగర్‌లోని సరస్వతి పాఠశాల విద్యార్థులకు దోమల నివారణపై జీహెచ్ఎంసీ మూసాపేట సర్కిల్ ఎంటమాలజీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. చెత్తా చెదారం నిల్వ ఉంచకుండా ఇంటి వద్దకు వచ్చే ఆటో రిక్షా కార్మికులకు అందజేయాలని సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటి నిల్వలు ఉంచుకోకుండా చూసుకోవాలన్నారు. సకాలంలో దోమల నివారణకు ఎంటమాలజీ సిబ్బంది తర చు ఫాగింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు విజయ్‌గౌడ్, ఎంటమాలజీ ఈఏ స్‌పీ ఉదయ్ కుమార్, సిబ్బంది ఎం. రాజు, శ్రీను, కృష్ణ, సుభాష్, స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్. ఆంజనేయులు, నాయకులు ఎన్. నవీన్‌కుమార్, ఇందిర, సరస్వతి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వరద నీరు సాఫీగా వెళ్లేలా కృషి

కార్పొరేటర్ సబిహాబేగం



డ్రైనేజీని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

మోతీనగర్: వర్షపునీరు నాలాలోకి సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో వర్షాకాలం నేపథ్యంలో ఏర్పడే సమస్యను నివారించేందుకు డ్రైనేజీ వ్యవస్థను జలమండలి మేనేజర్ హరిశంకర్, అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే విధంగా ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. మహ్మద్ గౌసుద్దీన్, సయ్యద్ రియాజ్, అబ్దుల్ హమీద్, అస్లాం బేగ్, మల్లేష్, సలావుద్దీన్, షేక్ రఫీక్, నర్సింహారెడ్డి, సలీం, మహ్మద్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

జీఎంకు సమస్యలు వివరించిన కార్పొరేటర్

హెచ్ఎండబ్ల్యూఎస్ జనరల్ మేనేజర్ హరిశంకర్‌ని కార్పొరేటర్ సబిహా బేగం బుధవారం కలిసి సమస్యలపై చర్చించారు. పర్వత్‌నగర్, వివేకానందనగర్, గాయత్రి నగర్, పద్మావతి నగర్, సెంట్రల్ అల్లాపూర్, అల్లాపూర్, రామారావు నగర్, ఆర్‌కే నగర్ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న మంచినీటి సరఫరా సమస్యలపై మాట్లాడారు. సమావేశంలో డీజీఎం శివ, మేనేజర్లు అన్వేత్ కుమార్ జాకీ, విలియం ప్రకాష్, జావిదుద్దీన్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పనుల పరిశీలన



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని ఎన్‌టీఆర్ నగర్‌లో నల్లపోచమ్మ, ముత్యాలమ్మ ఆలయ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. పనులను బుధవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు పరిశీలించారు. మల్లేష్, నాగరాజు, రామకృష్ణ, శివ, ఉమేష్, రాజు, మహేష్, కలిమ్, తదితరులు పాల్గొన్నారు.

6న 'టీటా' బోనాల జాతర

రాయదుర్గం: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీఐటీఏ) ఆధ్వర్యంలో 'టీటా బోనాల జాతర– 2025'ను నిర్వహించేందుకు నిర్ణయించినట్లు టీటా వ్యవస్థాపక అధ్యక్షుడు సందీప్‌కుమార్ మక్తాల బుధవారం తెలిపారు. ప్రతియేటా బోనాల జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది కూడా జూలై 6వ తేదీ ఉదయం 9 గంటలకు మాదాపూర్‌లోని శిల్పారామం నుంచి జాతర మొదలై చిన్న పెద్దమ్మ దేవాలయం వరకు సాగుతుందన్నారు. ఈ ఉత్సవాలలో ఐటీ ఉద్యోగులు బోనం ఎత్తి అమ్మవారికి సమర్పిస్తారన్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తులు, ఒగ్గుడోలు, ఆదివాసీ కొమ్ముకోయచ, గుస్సాడి నృత్యాలు ఇలా వివిధ కళారూపాల ప్రదర్శన ఉంటుందన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న మెట్రోజోన్ సీఈ సాయిబాబా, అధికారులు

మోతీనగర్: విద్యుత్ పనులు చేసే క్రమంలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని మెట్రో జోన్ సీఈ సాయిబాబా అన్నారు. బుధవారం మోతీనగర్‌లో విద్యుత్ భద్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా గ్రీన్‌ల్యాండ్ డివిజన్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వారం రోజుల పాటు విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహించి కార్మికులు విధులు నిర్వహించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన సూచనలు ప్రతి కార్మికునికి అర్థమయ్యే విధంగా తెలిపామన్నారు. విధులకు హాజరయ్యే ముందు మానసికంగా ప్రశాంతంగా ఉంటూ విధుల్లో పాల్గొంటే ప్రమాదాలు జరగకుండా ఉండటానికి ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కరుణాకర్‌బాబు, భీమా నాయక్, వివిధ సెక్షన్ల ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

నిజాంపేట్: పెట్టుబడుదారుల ప్రయోజనాల కోసం కార్మిక వర్గాన్ని బలి ఇచ్చే 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి నగర్‌లోని మున్సిపల్ కార్యాలయం వద్ద జులై 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. దేశమంతటా పూర్తి స్థాయిలో లేబర్ కోడ్స్ అమలులోకి రాకముందే జమ్మూకాశ్మీర్‌లో 420 యూనియన్ల రిజిస్ట్రేషన్‌లను ఆ రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా రద్దు చేసిందన్నారు. ఇటీవలే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాన్ని పది గంటల పని దినంగా నిర్ణయించిందన్నారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో లేబర్ కోడ్స్ సాకుతో కార్మిక సంఘాల, కార్మికుల హక్కులు హరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులకు కార్మిక వర్గాన్ని బానిసలుగా కేంద్ర ప్రభుత్వం తయారు చేస్తుందన్నారు. సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చెన్నయ్య, సత్యనారాయణ, నాగేశ్వర, నరసింహ, బాలస్వామి, నరసింగరావు, రమేష్, మనీ, లక్ష్మి, యాదమ్మ, వెంకటమ్మ, బుజ్జమ్మ, అలివేలు, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల కోసం నిరీక్షణ!

- నూతనంగా 24 వేల మంది దరఖాస్తులు
- ఫైనలిస్తేనే కార్డు వెరిఫికేషన్?
- మభ్యపెడుతున్న దళారులు



బాలానగర్: బాలానగర్ పౌర సరఫరాల శాఖ కార్యాలయం చుట్టూ రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ప్రదక్షిణలు చేస్తున్నారు. దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియ నెమ్మదిగా కొనసాగుతుంది. దీంతో దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. రూ.10 వేలు ఇస్తే కార్డు వచ్చేలా చేస్తామని దళారులు దరఖాస్తుదారులను మభ్యపెడుతున్నారు.

మూడు మండలాల పరిధిలో..

ఏఎస్ఓ కార్యాలయం కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, బాలానగర్ మండల పరిధిలోకి వస్తుంది. కొత్త రేషన్ కార్డుల కోసం 24 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. రేషన్ కార్డులో కొత్తగా పేర్ల నమోదు, కొత్తగా వివాహం అయిన వారి పేర్లు, తల్లిదండ్రులతో విడిపోయి వేరే కాపురం ఉంటున్న వారు రేషన్‌కార్డు కోసం నిత్యం తిరుగుతున్నారు. చిరునామా మార్పు, తప్పులు సరిచేయటం లాంటి కారణాలతో రోజు ఏఎస్ఓ కార్యాలయానికి వస్తున్నారు. తిరగటమే కానీ పనులు కావడం లేదని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఐలు సర్వే చేసి ఇచ్చిన దరఖాస్తులు ఏఎస్ఓ కార్యాలయానికి అందజేస్తారు. అటువంటివి 800 దరఖాస్తులు ఏఎస్ఓ కార్యాలయం సిబ్బంది వాటిని స్కాన్ చేసి వివరాలు అప్‌లోడ్ చేసి జిల్లా పౌరసరఫరాల కార్యాలయానికి పంపించాలి. రోజులు గడుస్తున్నప్పటికీ దరఖాస్తులు స్కాన్ చేయలేదు.

దళారుల హవా!

రేషన్‌కార్డు కోసం ఎదురు చూసేవారు దళారులను ఆశ్రయిస్తే ప్రక్రియ వేగంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. కార్డు కోసం రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నట్లు వినిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు రేషన్‌కార్డు ప్రక్రియను వేగవంతం చేయాలని, దళారుల దోపిడిని నివారించాలని ఆయా పార్టీల నాయకులు కోరుతున్నారు. పై విషయమై అధికారులను వివరణ కోరగా.. సరిపడా సిబ్బంది లేక ఆలస్యం అవుతుందని, ఎవరూ కూడా దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.

రౌడీషీటర్‌గా ఎదగాలని హత్య చేసిన స్నేహితులు

- మిత్రుడి పుట్టినరోజు వేడుకల్లో మద్యం తాగించి రౌడీషీటర్‌ను హత మార్చిన వైనం
- నిందితులను రిమాండ్‌కు తరలించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్ కుమార్ తదితరులు

మూసాపేట: రౌడీ షీటర్‌ను హత్య చేసి అతని స్థానంలో రౌడీ షీటర్‌గా ఎదగాలని తోటీ స్నేహితులే అతడిని హత్య చేశారు. రౌడీషీటర్ సయ్యద్ సాహెద్ హత్య కేసులో నిందితులను బుధవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. అల్లాపూర్‌లోని పండిట్ నెహ్రూ నగర్‌కు చెందిన సయ్యద్ సాహెద్ (26) బట్టలషాపు నడిపిస్తూ రౌడీషీటర్‌గా చలామణి అయ్యేవాడు. వై. హానక్ అలియాస్ మున్నా (25) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ బోరబండలో నివాసముంటున్నాడు. ఎండీ సాజిద్ (24) ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తూ మౌలాలిలో నివాసం ఉంటున్నాడు. ఇతను ఇన్‌ఫ్లూయర్‌గా చేస్తున్నాడు. ఎండీ సమీర్ ఖాన్ అలియాస్ దగడ్ సమీర్ (25) బోరబండలో నివాసం ఉంటున్నాడు. వీరందరు స్నేహితులే. సయ్యద్ సాహెద్ సాజిద్‌కు ఇన్‌ఫ్లూయర్స్‌గా వస్తున్న డబ్బుల్లో కొంత డబ్బులను తనకు ఇవ్వాలని పలుమార్లు ఒత్తిడికి గురి చేస్తూ అందరిముందు అవమాన పరుస్తుండేవాడు. మిగతా స్నేహితులు సాహెద్‌ను చంపి అతని స్థానంలో రౌడీషీటర్‌గా చెలామణి అవ్వాలని నిర్ణయించుకున్నారు. గతంలో సయ్యద్ సాహెద్ సోషల్ మీడియాలో చేసిన పోస్టులు కూడా వైరాన్ని పెంచింది. 20 రోజుల నుంచి అతడిని చంపాలని ముందస్తు ప్రణాళికలు వేసుకున్నారు. వీరందరి మిత్రుడు అయిన పవన్ పుట్టిన రోజును అదునుగా చేసుకున్నారు. జూన్ 29న కూకట్‌పల్లిలోని ప్రకాష్‌నగర్ దేవిస్థాన హోమ్స్ సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో కలుసుకున్నారు. పథకం ప్రకారం పుట్టిన రోజు వేడుకల్లో ఉన్న మిగిలిన మిత్రులను సమీర్ బయటకు తీసుకెళ్లాడు. మున్నా, సాజిద్‌లు సయ్యద్ సాహెద్‌కు మద్యం తాగించి బీరు బాటిల్ పగుల గొట్టి గొంతులో పొడిచారు. అనంతరం ఇటుక రాళ్లతో మొహంపై బాదడంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సమీర్‌ఖాన్‌పై జూబ్లీహిల్స్, సనత్‌నగర్, ఎస్ఆర్‌నగర్, బాచుపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు కేసులు ఉన్నాయని, బోరబండలో రౌడీషీట్ ఉందని డీసీపీ తెలిపారు.